
గురువారం 18 జులై2024

ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

# డీఎస్సీ విద్యార్థులు అలర్ట్.. ఇయ్యాల్టి నుంచే పరీక్షలు..



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17:** నిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ పరీక్షలు ఇయ్యాల్టి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ రోజు రెండు సెషన్ లలో డీఎస్సీ నిర్వహించనున్నారు అధికారులు. మొత్తం 11,062 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 29న ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే.. సుమారు 2 లక్షల 79 వేల 957 మంది అభ్యర్థులు పరీక్షలకి దరఖాస్తు చేసుకున్నారు. ఒకవైపు పరీక్షలను వాయిదా వేయాలని కొందరు అభ్యర్థులు డిమాండ్ చేస్తుంటే%%% రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణకే మొగ్గు చూపుతోంది. ఇప్పటికే హాల్ టిక్కెట్లు జారీ కాగా.. తొలిసారి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మెదక్‌లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.





ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తాం...డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2లో



రేవంత్ రెడ్డిని మెచ్చుకున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు.. ఎందుకంటే.... 2లో



'ముదురు' ప్రేమ అంటే ఇదేనేమో..? పది మంది పిల్లలున్న వ్యక్తితో ఆరుగురు పిల్లల తల్లి జంప్...! 3లో



ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్.. తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం 3లో

తొలి ఏకాదశి సందడి....

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు..

## మరో వైపు ప్రశాంతంగా మొహర్రం



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 17:** నగరమంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివెత్తింది. తొలి ఏకాదశి, మొహరం ఒకే రోజు కావడంతో భక్తులు పూజలు, ప్రార్థనలు చేశారు. అలాగే తొలి ఏకాదశి సందర్భంగా అంబర్ పేటలోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ఆలయాల వద్ద క్యూలు కట్టారు. ఇక యాదగిరిగుట్ట, బాసర, శ్రీశైలం, వేములవాడ, భద్రాచలం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొందరు ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్షలు చేశారు.

## ప్రశాంతంగా.. మొహర్రం ఊరేగింపు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 17:** ఇమామ్ హుస్సేన్ త్యాగానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం సంతాప దినాలు బుధవారంతో ముగిశాయి. మొహర్రం సందర్భంగా షియాలు మాతమ్ నిర్వహించారు. నల్ల దుస్తులు వేసుకుని ఇమామ్ హుస్సేన్ ఆలం ముందు రక్తం చిందించారు. అంబర్ పేటలోని ప్రేమ్ నగర్, అలీకేఫ్ చౌరస్తా, బాగ్అంబర్ పేట ఆషూర్ ఖానా, నల్లకుంట, గోల్నాక, కాచిగూడ లోని ఆలావాల వద్ద భారీ సంఖ్యలో షియాలు పాల్గొన్నారు. మాతమ్‌లో పాల్గొన్న వారికి నిర్వాహకులు షర్బత్, తాగునీరు, అందించి అన్నదానాలు చేశారు. ఊరేగింపులో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.



# ఆగస్టులోపే మూడు దశల్లో రుణమాఫీ

## ఇయ్యాల రూ.7 వేల కోట్లు రైతుల ఖాతాల్లోకి : సీఎం రేవంత్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17:** ఆగస్టులోపే మూడు దశల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇయ్యాల గురువారం సాయంత్రం 4 గంటలకు రూ.7 వేల కోట్ల రుణమాఫీ రైతుల ఖాతాల్లోకి వెళుతుందన్నారు. ప్రతి రైతుకు రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో బుధవారం కాంగ్రెస్ నేతల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. గడిచిన ఏడు నెలల పాలనపై సమీక్షించారు."నేడు లక్ష రూపాయల వరకు రైతు రుణాలకు నిధులు విడుదల చేస్తాం. ఈ నెలాఖరులోపు రూ.1.5 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ జరుగుతుంది. ఆగస్టులో రూ.2 లక్షల వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. చిత్తశుద్ధితో ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని చెప్పారు. అందుకే ఏకమొత్తంలో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నామని తెలిపారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే రూ.2 లక్షల రైతు రుణమాఫీ అని మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ శ్రేణులకు వివరించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు సీఎం రేవంత్? రెడ్డి ఆదేశించారు. రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండని, దీనిపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని అన్నారు.

**దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత మొత్తంలో మాఫీ చేయలేదు :**

దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన గ్యారంటీని అమలు చేశామని పార్లమెంటులో ఎంపీలు ప్రస్తావించాలని చెప్పారు. రేపు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబురాలు జరగాలని అన్నారు. ఏడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి రూ.30 వేల కోట్లు ఖర్చు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# బడ్జెట్‌పై ఇయ్యాల కేంద్ర క్యాబినెట్ సమావేశం



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 17: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ నేడు సమావేశం కానుంది. గురువారం ఉదయం 10.30 గంటలకు కేంద్ర క్యాబినెట్ సమావేశం కానున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయితే బడ్జెట్ సమావేశాలకు కొద్ది రోజుల ముందు కేంద్ర క్యాబినెట్ సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22న (సోమవారం) ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23న (మంగళవారం) పార్లమెంటులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆగస్టు 12న ఈ బడ్జెట్ సమావేశాలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్ సెషన్ నిర్వహణకు సంబంధించి చర్చ జరుగుతుందని మీడియా కథనాలు వెల్లడవుతున్నాయి.ఇదిలావుంటే ప్రధాని నరేంద్రమోదీ ఈ రోజు సాయంత్రం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్తున్నారు. అక్కడ సాయంత్రం 6 గంటలకు పార్టీ శ్రేణులతో ప్రధాని సమావేశం కానున్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌లో పార్టీ అనుసరించబోయే వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉప ఎన్నికలు.. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఈ సమావేశంలో పార్టీ శ్రేణులకు ప్రధాని దిశానిర్దేశం చేయనున్నారు.

## అంతా ఆయనే చేస్తున్నారా ?

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులకు కారణం ఎవరు?



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17: భారత రాష్ట్ర సమితి ఇప్పుడు పార్టీ ఫిరాయింపులతో ఇబ్బంది పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాల్లో గెలిచి బలంగా ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ పరిస్థితి రాను రాను దిగజారిపోతోంది. ఎంత మంది ఎమ్మెల్యేలు పార్టీలో ఉంటారో తెలియడం లేదు. ఇప్పటికే పది మంది పార్టీ మారిపోయారు. మరో పదిహేను మంది కూడా ఊగిసలాటలో ఉన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలు ఎందుకు పార్టీ వీడిపోతున్నారంటే.. కాంగ్రెస్ ప్రలోభాలు అనే కారణం బీఆర్ఎస్ వైపు నుంచి వస్తుంది. కానీ ఎమ్మెల్యేలు మాత్రం ప్రధానంగా కేటీఆర్ డామినేషన్ కేసీఆర్ అందుబాటులో ఉండకపోవడాన్ని ఎక్కువ కారణాలు చూపిస్తున్నారు. ఓ రకంగా అందరూ కేటీఆర్ ను కారణంగా చూపించే అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయి.

### ఐదేళ్లు పార్టీ, ప్రభుత్వంలో తిరుగులేని నేతగా కేటీఆర్

కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గానే కాదు.. అనధికారిక సీఎంగానూ వ్యవహరించారు. కేసీఆర్ అత్యంత ముఖ్యమైన వ్యవహారాలను మాత్రమే చూసుకునేవారు. రోజువారీ పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలు కేటీఆర్ కనుసన్నల్లోనే జరిగేవి అయితే అధికారంలో ఉన్నారు కాబట్టి ఆయన చేతిల్లోనే పవర్ అంతా ఉంది కాబట్టి నెతలెవరూ అసంతృప్తి బయటకు వ్యక్తం చేయలేదు. పార్టీ వదిలి వెల్లిపోయిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గడ్డం వివేక్ వరి నేతలు మాత్రం . కారణంగా కేటీఆర్ అహంకారాన్ని చూపించేవారు. అయితే ఇప్పుడు అధికారం పోయిన తర్వాత పార్టీని వీడిపోతున్నవారు కేటీఆర్ న ప్రధానంగా కారణంగా చూపించేందుకు వెనుకాడటం లేదు. కేటీఆర్ అహంకారం, పార్టీ నేతల్ని గౌరవించని తీరు వల్లనే బీఆర్ఎస్ కు ఈ పరిస్తితి వచ్చిందని అంటున్నారు.

### కేటీఆర్ గౌరవం ఇవ్వలేదని ఎమ్మెల్యేల భావన

కేటీఆర్ సమవేశాలకు పిలిస్తే అత్యధిక మంది ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు. స్పీకర్ తో సమావేశానిక ఎమ్మెల్యేలు అందరూ కలిసి వెళ్లాలనుకున్నారు . కానీ కేసీఆర్ మినహాయించి 12 మంది డుమ్మా కొట్టారు. పార్టీ మారిన దానం నాగేందర్ బీఆర్ఎస్ దుస్థితికి కేటీఆరే కారణని ఆరోపణలు కూడా చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేటీఆర్ సీనియర్లకి గౌరవం ఇవ్వలేదు అనే ఆరోపణ కూడా చేశారు. ఆయన మాట వినే పరిస్థితిలో ఎవరూ లేరని వ్యాఖ్యానించడం గమనార్హం. పార్టీ పూర్తిగా భ్రష్టు పట్టడానికి కేసీఆర్ కాదని.. పూర్తిస్థాయి బాధ్యుడు కేటీఆర్ మాత్రమేనని దానం తేల్చేశారు. కానీ ఎక్కువ మంది అభిప్రాయం అదేనని బీఆర్ఎస్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే లకు బీఆర్ఎస్ లో గౌరవం లేకుండా కేటీఆర్ అవమానించేవారు. కేటీఆర్ గుట్టు త్వరలో బయటపెడతా. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన్ని కలవనియకుండా గంటలు గంటలు నిరీక్షణ కు గురిచేసేవారు. కేటీఆర్ ఓన్లీ తన నియోజకవర్గం సిరిసిల్లలో వేల కోట్లతో డెవలప్ చేశారు తప్ప.. ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో అభివృద్ధి కి నిధులు ఇవ్వలేదన్నది ఎక్కువ మంది అభియోగం.

### హరీష్ రావుకు ప్రాధాన్యం పెరుగుతోందా ?

అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో వచ్చిన ఎమ్మెల్యేలతో కేటీఆర్, హరీష్ సమావేశం అయ్యారు. అక్కడ మాత్రం కేటీఆర్.. ప్రధానమైన కుర్చీలో కూర్చోలేదు. హరీష్ రావు కూర్చుని ఎమ్మెల్యేతో మాట్లాడారు. కేటీఆర్ తనపై ఎమ్మెల్యేల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించి.. కాస్త తగ్గే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. హరీష్ రావును ముందు పెట్టి రాజకీయాలు చేయాలనుకుంటున్నారని బీఆర్ఎస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఈ మార్పు ఎంత వరకూ ఫలితం ఇస్తోందో .. ఎంత మంది పార్టీ మారకుండా ఆగుతారో చూడాలని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

# సత్యమేవ జయతే..!

## కేసీఆర్ కేసులో తీర్పుపై కేటీఆర్ సంచలన ట్వీట్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17:** సత్యమేవ జయతే.. త్వరలో ప్రజాకోర్టు కూడా ఇలాంటి తీర్పును వెలువరించనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం వేసిన విద్యుత్ కమీషన్ ను రద్దు చేయాలన్న కేసీఆర్ వేసిన పిటీషన్ పై సుప్రీం కోర్టు తీర్పును వెలువరించింది. దీనిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సత్యమేవ జయతే! అంటూ రాజకీయ పగ, బలిదానాలకు పరిమితులు ఉన్నాయని, బాధితులను ఎక్కువ కాలం భరించలేమని సుప్రీంకోర్టు తీర్పు పునరుద్ఘాటించిందని అన్నారు. కేసీఆర్ కేసులో అధికార దుర్వినియోగంపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసిందని తెలిపారు. అలాగే త్వరలో ప్రజాకోర్టు కూడా ఇలాంటి తీర్పును వెలువరించనుందని వ్యాఖ్యానించారు. దురుద్దేశపూరిత ప్రచారానికి గాను కాంగ్రెస్‌ను సర్వశక్తివంతమైన కోర్టు శిక్షిస్తుందని చెబుతూ.. సత్యం ఒక్కటే విజయం! సాధిస్తుందని రాసుకొచ్చారు. కాగా, గత ప్రభుత్వ పాలనలో విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ నిమిత్తం కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై కేసీఆర్ ఈ కమిటీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయగా.. కేసీఆర్ పిటీషన్ ను ఉన్నత న్యాయస్థానం కొట్టేసింది. దీనిపై కేసీఆర్ సుప్రీం కోర్టుకు వెళ్లారు. కేసీఆర్ పిటీషన్ పై మంగళవారం విచారణ జరిపిన సుప్రీం కోర్టు ధర్మాసనం.. జస్టిస్ నర్సింహారెడ్డి స్థానంలో మరో జడ్జిని నియమించాలని కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# ఇయ్యాల రాష్ట్ర బ్యాంకర్లతో సీఎం సమావేశం

## రైతులను ఉద్దేశించి రేవంత్ సందేశం



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17: ప్రజాభవన్ లో ఈ రోజు ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్లతో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్ధిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, తదితరులు పాల్గొననున్నారు. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ అమలులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేయనున్నారు. రూ. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో అన్ని మండల కేంద్రాలలో ఉన్న రైతు వేదికల్లో రైతుల సమావేశాలు నిర్వహించనున్నారు. దీంతో హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సందేశం ఇవ్వనున్నారు. రైతు వేదికల దగ్గర సంబరాలకు పిలుపు నిచ్చారు. రేపు సాయంత్రానికి రైతుల ఖాతాలోకి లక్ష రుణమాఫీ చేయనున్నారు. ఒకటి, రెండు రైతులతో సీఎం స్వయంగా మాట్లాడనున్నారు.

మిగతా..

ఈ-పేపర్ తెలుగు డైలీ
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
గురువారం 18 జులై2024



## రేపటి నుంచి 3 రోజుల పాటు శాకాంబరి దేవిగా కనకదుర్గమ్మ దర్శనం



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 17: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు రేపు (శుక్రవారం) నుంచి మూడు రోజులపాటు శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వివిధ కూరగాయలు, ఆకులు, ఆకు కూరలతో అర్చకులు, అధికారులు అమ్మవారిని అలంకరించనున్నారు. కూరగాయలతో అలంకారంలో కనకదుర్గమ్మ కనిపించనున్నారు. కనకదుర్గమ్మ ఆలయం మొత్తాన్ని కూరగాయలతో అలంకరించనున్నారు. వారాంతపు సెలవులు ఉండే సమయం కావడంతో భక్తుల రద్దీకై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరోవైపు నేడు ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ నెలకొంది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారె సమర్పించారు.

## రేవంత్ రెడ్డిని మెచ్చుకున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు..ఎందుకంటే..



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిని మెచ్చుకున్నారు. రైతు రుణమాఫీ మార్గదర్శకాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను స్వచ్ఛమైన తెలుగులో జారీ చేయడటం పట్ల వెంకయ్య నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ.. ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. మాజీ ఉప రాష్ట్రపతి పోస్ట్ పై స్పందించిన రేవంత్ రెడ్డి వెంకయ్య నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

"ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా పరిపాలనకు సంబంధించిన అంశాలు తెలుగులో జారీ చేయాలని నేను ఎప్పటినుంచో సూచిస్తూనే ఉన్నాను. తెలంగాణ ప్రభుత్వం తొలిసారి తెలుగులో, అందులోనూ రైతుల రుణమాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయం. ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు వారికి సులువుగా.అర్థమయ్యే భాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించి ఇతర సమాచారం ఉండాలని నేను ఎప్పటినుంచో చెబుతున్నాను. ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యమిస్తూ తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ రఘునందన్ రావు గారికి, ఈ ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇతర అధికారులు, సిబ్బందికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇకనుంచి అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలని ఆకాంక్షిస్తున్నాను." అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు.

## ముగిసిన ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన..




ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 17: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హస్తిన పర్యటన ముగిసింది.. బుధవారం ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణం అయి ఏపీకి చేరుకున్నారు.ఢిల్లీలో బుధవారం మరికొంతమంది కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలుస్తారని ముందుగా ప్రచారం జరిగింది.. ముఖ్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై.. ఏపీకి రావాల్సిన బకాయిలను విడదల చేయాలని కోరనున్నారని.. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రారంభంలో రాష్ట్ర ఖజానా నుంచి పెట్టిన ఖర్చు బకాయిలను కూడా కేంద్రం వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరే అవకాశం ఉందన్నారు.. మరోవైపు.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను కలిసి.. జాతీయ సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణ ప్రక్రియ జాప్యానికి అడ్డుగా ఉన్న ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యలు, అభ్యంతరాలను కేంద్రం వేగంగా పరిష్కరించాలని కోరతారనే ప్రచారం కూడా సాగింది.. అయితే, హస్తినలో ఏపీ చంద్రబాబు.. ఇతర కేంద్ర మంత్రులను కలిసే అవకాశం లేదని తెలుస్తోంది..కాగా, మంగళవారం ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు.. రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు.. పలు కీలక అంశాలపై హోం శాఖ మంత్రితో ఏపీ సీఎం చర్చించినట్లు తెలుస్తుంది.

## మాట నిలబెట్టుకున్న నారా లోకేష్.. కువైట్ నుంచి సొంత గ్రామానికి చేరుకున్న శివ



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 17: కువైట్‌లో వేధింపులకు గురై దుర్భర జీవితం గడుపుతున్నానంటూ ఓ తెలుగు కార్మికుడు సోషల్ మీడియాలో పెట్టిన వీడియోపై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేష్.. ఎట్టకేలకు తన మాటను నెలబెట్టుకున్నారు. ఏపీ ప్రభుత్వం చొరవతో కువైట్‌లో చిక్కుకున్న అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన శివ కువైట్ నుంచి తన స్వగ్రామానికి చేరుకున్నారు. తనకు సాయం చేయకపోతే చావే దిక్కంటూ బాధితుడు సామాజిక మాధ్యమంలో వీడియో పోస్ట్ చేసిన విషయం విదితమే. నెల రోజుల ముందు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏజెంట్ సాయంతో కువైట్ వెళ్లిన శివను అక్కడ పని పేరుతో హింసకు గురి చేశారు. దీంతో తనను కాపాడాలని, లేకపోతే మరణమే శరణ్యం అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఈ పోస్ట్‌కు మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఎంబసీని సంప్రదించి శివను ఇండియాకు రప్పిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శివను ఇండియాకు రప్పించేలా ఏర్పాట్లు చేయడంతో సురక్షితంగా సొంత గ్రామానికి చేరుకున్నాడు. శివ సేఫ్‌గా ఇంటికి చేరడంతో కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్, చంద్రబాబు, పవన్ కు శివ, అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. శివ సురక్షితంగా ఇండియాకు చేరుకోవడంపై మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. శివ సురక్షితంగా ఇండియాకు చేరుకోవడంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆ కుటుంబానికి దేవుడి ఆశీస్సులు ఉన్నాయన్నారు.

## రేపు ఢిల్లీకి ..ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..



ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూలై 17: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. రేపు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు.. డిప్యూటీ సీఎం పదవితో పాటు.. కీలకమైన శాఖలను తీసుకున్న పవన్.. వరుసగా ఆ శాఖలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు.. ఇక, ఏ శాఖలో చూసినా నిధులు లేవంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయం విదితమే.. మరోవైపు క్షేత్రస్థాయిలోనూ ఆయన పర్యటనలు కొనసాగుతున్నాయి.. జలజీవన్ మిషన్‌పై మాట్లాడుతున్న పవన్.. ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందజేయడం తన లక్ష్యం అంటున్నారు.. అందులో భాగంగా.. ఢిల్లీలో జరగనున్న జలజీవన్ మిషన్ సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు పవన్ కల్యాణ్..

## బీఆర్ఎస్ నమ్ముకున్నది కార్యకర్తలు, ప్రజలను మాత్రమే.. హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు



ఇయ్యాల్టి న్యూస్, పటాన్ చెరు, జూలై 17: ఎమ్మెల్యేలు ఉన్నా వెళ్లిపోయినా బీఆర్ఎస్‌కు పోయేదేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వైఎస్ హయాంలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కున్నారని గుర్తు చేశారు. అప్పుడు కూడా బీఆర్ఎస్ పని అయిపోయిందని అన్నారని చెప్పారు. కానీ బీఆర్ఎస్‌కు ఏమీ కాలేదని, ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఏం తక్కువ చేసిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. మహిపాల్‌రెడ్డిని మూడుసార్లు ఎమ్మెల్యేను చేసిందని గుర్తు చేశారు. గూడెం వెళ్లిపోయినా.. బీఆర్ఎస్ కార్యకర్తలు గుండె ధైర్యంతో ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ నమ్ముకున్నది కార్యకర్తలను, ప్రజలను మాత్రమే అని స్పష్టం చేశారు. పార్టీ మారే ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టామన్నా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట తప్పారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డే ఇప్పుడు వివక్ష ఎమ్మెల్యేలను లాక్కుంటున్నారని అన్నారు. కాగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరటం ఆ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. ముఖ్యంగా పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిష్టానం నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన మహిపాల్‌రెడ్డిని పార్టీలో ఎలా చేర్చుకుంటారంటూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీముఖ్యం గా కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తుంది. అందుకే మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక కార్యక్రమానికి కాటా శ్రీనివాస్‌గౌడ్ దూరంగా ఉన్నారు. కాటా వర్గానికి చెందిన నాయకులు బాహాటంగానే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై కాటా, మహిపాల్‌రెడ్డి అనుచరుల మధ్య సోషల్ మీడియా వేదికగా రెండురోజులుగా వార్ కొనసాగుతున్నది.

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని వాకబు చేశారు. కాగా, గత కొన్ని రోజులుగా సుధీర్ రెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని బుధవారం కేటీఆర్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్, సుధీర్ రెడ్డి సతీమణి కమల తదితరులు ఉన్నారు.

## ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తాం

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17: ప్రజాభవన్ లో కాంగ్రెస్ కీలక నాయకులు సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆగస్టు దాటకుండానే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. రుణమాఫీ కార్యక్రమం అమలు చేసేందుకు నిద్రలేని రాత్రులు గడిపాము.. రూపాయి రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టామని, అన్ని కుటుంబాలకు రుణమాఫీ చేస్తామన్నారు భట్టి విక్రమార్క. రేషన్ కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ అందిస్తామని, ఎవరిని వదలం.. ఎవరికి అవకాశం ఇవ్వమన్నారు భట్టి విక్రమార్క. కాంగ్రెస్ నాయకులారా రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రతి పోలింగ్ బూతు, ప్రతి ఓటర్ దగ్గరకు కార్యక్రమాన్ని తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. తల ఎత్తుకొని %౧% ఎక్కడ తగ్గకుండా ప్రచారం చేయండని, మిగులు బడ్జెట్ తో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని 25000 చొప్పున.. నాలుగు దపాలుగా పూర్తి చేశారన్నారు భట్టి విక్రమార్క.

## ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం 28 వేల కోట్లు ఉత్తమ్

### బడ్జెట్‌లో కేటాయింపులు చేశాం...మంత్రి



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 17: ఎన్డీఎస్ఏ చైర్మన్, అధికారులతో మాట్లాడినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 20న ఢిల్లీలో ఎన్డీఎస్ఏ కమిటీతో సమావేశం ఉంటుందని, వర్షాల నేపథ్యంలో డ్యామ్ ల వద్ద తీసుకోవాల్సిన చర్యల పై చర్చించామన్నారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. పెండింగ్ ప్రాజెక్టులపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష చేశామని, ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం 28 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయింపులు చేశామన్నారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. 18 వేల కోట్లు గత ప్రభుత్వ అప్పుల ఇంట్రెస్ట్ కి పోతున్నవని, ఇరిగేషన్ పనుల కోసం మరో 11 వేల కోట్లు బడ్జెట్ లో పెట్టాలని ఆర్థిక శాఖని కోరుతున్నామన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. 2025 డిసెంబర్ వరకు పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, డిండి కూడా ప్లాన్ లో ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL

## దుబాయ్ యువరాణి సంచలన ప్రకటన.. విడాకులు తీసుకుంటున్నట్లు వెల్లడి

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 17: మొహర్రం పండుగ రోజున దుబాయ్ యువరాణి షైకా మహ్రా మొహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ సంచలన నిర్ణయం తీసుకుంది. తన భర్త షేక్ మనా బిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌తో విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగామ్‌లో కీలకమైన నిర్ణయాన్ని వెల్లడించింది. ఇదిలా ఉంటే ఈ దంపతులకు మే 2, 2024న తొలి సంతానంగా ఆడ బిడ్డ జన్మించింది. ఆ సంతోషం ఎంతో కాలం లేకుండానే రెండు నెలలకే ఈ ప్రకటన రావడంతో తీవ్ర సంచలనం రేపుతోంది. సోషల్ మీడియాలో ఆమె పోస్టు చూసిన నెటిజన్లు ఆశ్చర్యానికి గురయ్యారు.





## 'ముదురు' ప్రేమ అంటే ఇదేనేమో..?
## పది మంది పిల్లలున్న వ్యక్తితో ఆరుగురు పిల్లల తల్లి జంప్...!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 17: ప్రేమ గుడ్డిది అంటుంటారు. గుడ్డి మాత్రమేకాదు మూగ, చెవిటి, కుంటిది కూడా అని తాజా సంఘటనతో తేలిపోయింది. వారిది మనవళ్లను ఎత్తుకోవల్సిన వయసు. ఇరువురికి గంపెడు పిల్లలున్నారు. అంతా పెళ్లీడుకు వచ్చారు. వారి అచ్చటా ముచ్చటా చూసి ఆనందించవల్సిన వయసులో ప్రేమలో పడటమేకాకుండా.. ఇళ్ల నుంచి పారిపోయి అందరికీ షాక్ ఇచ్చారు. మరో వైపు కూతురు పెళ్లి జరుగుతుంటే.. తల్లి ఇలా చేయడంతో అందరికీ పరువుపోయినట్లైంది. మరో ట్విస్ట్ ఏంటంటే వీరిద్దరూ వియ్యంకులు కూడా. కనీసం వయసులో ఉన్న ఏదో ఒక జంట ఈ పని చేసి ఉంటే.. ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. వయసు అలాంటిది అని సరిపెట్టుకునేవారు. కానీ తాము కూడా ఏమాత్రం తక్కువ కామని యూపీలో ఈ ముదురు ప్రేమజంట నిరూపించింది. వివరాల్లోకెళ్తే..ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌కు చెందిన సాక్షాత్తూ పెళ్లయ్యి 10 మంది పిల్లలున్న వ్యక్తి, పెళ్లయ్యి ఆరుగురు సంతానం ఉన్న మరో మహిళతో కలిసి ప్రేమాయణం సాగించారు. అంతటితో ఆగకుండా ఇద్దరూ జంప్ కావడం చర్చణీయాంశంగా మారింది. పైగా సదరు మహిళ కుమారుడి కాబోయే అత్త కావడం మరో ట్విస్టు. ఈ సంఘటన జూన్ మొదటి వారంలో



చోటు చేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యూపీలోని కాస్‌గంజ్‌లో కూలిపని చేసుకునే వ్యక్తి, ఈ-రిక్షా డ్రైవర్‌గా చేసే షకీల్ గత 28 ఏళ్లుగా స్నేహితులు. తన కుమారుడికి అతని కుమార్తెతో వివాహం జరిపించాలని షకీల్ అడగడంతో ఆయన కూడా ఓకే అన్నాడు. 2 నెలల క్రితం నిశ్చితార్థం కూడా జరిపారు. జూన్ 17న వివాహం చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య ఏర్పడిన పరిచయాల కొద్దీ వధువు తల్లి, వరుడు తండ్రి (షకీల్)తో అడపాదడపా మాటకలుపుతూ ఉండేది. ఈ లోగా ఇరు కుటుంబాలకు షాక్ ఇస్తూ జూన్ 3న షకీల్, పెళ్లికుమార్తె తల్లితో ఉడాయించాడు. అయితే షకీల్ తన భార్యను కిడ్నాప్ చేశాడంటూ కొత్వాలి గంజ్‌దుండ్వారా పోలీస్ స్టేషన్‌లో స్నేహితుడు ఫిర్యాదు చేశాడు. బాధిత భర్త ఫిర్యాదు మేరకు ముదురు ప్రియుడు, ముదురు ప్రేయసి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పది మంది సంతానం ఉన్న షకీల్, ఆరుగురు పిల్లలున్న పెళ్లి కుమార్తె తల్లి ఇలా చేయడం చూసి బంధువులు, చుట్టుపక్కల వారు ముక్కున వేలుసుకున్నారు.

## 'టిప్ టిప్ బర్సా' అంటూ కలెక్టరేట్ మెట్లపై చిందులు..
## కట్‌చేస్తే.. రీల్స్ పిచ్చితో చిక్కుల్లో పడ్డ తిక్కలక్క..!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 17: రీల్స్ పిచ్చి యువతలో బాగా ముదిరిపోయింది. దీంతో ఎక్కడ పడితే అక్కడ వీడియోలు తీస్తూ జనాల్ని ఇబ్బందిపెడుతున్నారు. బస్సులు, రైళ్లు, కొండలు, గుట్టలు అనే తేడా లేకుండా వీడియోలు తయారు చేస్తున్నారు. రీల్స్, వ్యూస్ కోసం కొందరు ప్రాణాలను రిస్క్‌లో పెడుతున్నారు. అలాంటిదే ఇక్కడ ఓ యువతి ఏకంగా కలెక్టరేట్ ఆఫీస్ మెట్లపై డ్యాన్స్ చేస్తూ వీడియో తీసింది. వీడియో వైరల్ కావడంతో జిల్లా మేజిస్ట్రేట్ ఆమెపై సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. రీల్ మేకింగ్, ఫోటోగ్రఫీ, షూటింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి ఆదేశాలు జారీ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే%ొా%మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ కలెక్టరేట్ భవనం మెట్లపై ఓ అమ్మాయి సినిమా పాటపై రీల్ చేసింది. ఈ రీల్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పరిపాలనా విభాగంతో చాలా విమర్శలు వచ్చాయి. దాంతో గ్వాలియర్ కలెక్టర్ ఈ విషయంలో చాలా కఠిన చర్యలు తీసుకున్నారు. ఇది అక్కడి కంటెంట్ క్రియేటర్స్ అందరిపై ప్రభావితం చూపనుంది. కలెక్టర్ ఆదేశాలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంతకీ వైరల్ వీడియోలో ఏముందంటే..కలెక్టరేట్ మెట్లపై ఓ



యువతి డ్యాన్స్ చేస్తూ వీడియో తయారు చేసింది. టిప్ టిప్ బర్సా పానీ పాటకు డ్యాన్స్ చేసి వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వివాదం మొదలైంది. ఆ వీడియో వైరల్ కావడంతో కలకలం రేగింది. కలెక్టరేట్‌కు సెలవు రోజున ఆ అమ్మాయి ఇలా డ్యాన్స్ వీడియో రికార్డ్ చేసిందని తెలిసింది. కానీ, ఏకంగా కలెక్టరేట్ కార్యాలయం మెట్లపైనే యువతి ఇలా డ్యాన్స్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో గ్వాలియర్ పాలకవర్గంపై నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. దాంతో గ్వాలియర్ జిల్లా మేజిస్ట్రేట్ కీలక ఉత్తర్వు జారీ చేశారు. అందులో ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాప్‌లు, చారిత్రక ప్రదేశాలతో సహా బహిరంగ ప్రదేశాలలో అసభ్యకరమైన రీళ్లు, డ్యాన్సులు చేస్తూ వీడియోలు తయారు చేస్తున్నారని, దీని కారణంగా గ్వాలియర్ జిల్లా ప్రతిష్ట మసకబారుతుందని అన్నారు జిల్లా మేజిస్ట్రేట్. అందువల్ల ఇకపై గ్వాలియర్‌లో ఎలాంటి షూటింగ్‌లకైనా తప్పనిసరి అనుమతి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.


## కారులోనే దుకాణం పెట్టిన కరువు జంట....వీడియో వైరల్ ..పోలీసుల యాక్షన్..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 17: నాగ్‌పూర్‌లో కారులో ఓ వ్యక్తి తన లవర్‌తో చేసిన రొమాన్స్ వైరల్ అవుతోంది. కారులో ప్రయాణిస్తూ ఇలాంటి పనులు చేయడమేంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కారుని నడుపుతున్న వ్యక్తి తన ఒడిలో ప్రియురాలిని కూర్చోపెట్టుకుని మద్దు పెట్టుకుంటున్న వీడియోలు వైరల్ కావడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటన సోమవారం జరిగింది. భారతీయ న్యాయ సంహిత , బొంబాయి పోలీస్ చట్టం మరియు మోటారు వాహనాల చట్టం. ర్యాష్ డ్రైవింగ్ చట్టాల కింద అతడిపై అభియోగాలు మోపారు. 28 ఏళ్ల వ్యక్తిని చార్డర్డ్ అకైంటెంట్‌గా సూరజ్ రాజ్‌కుమార్ సోనీగా గుర్తించారు. అతడి ప్రియురాలు ఇంజనీర్ విద్యార్థినిగా గుర్తించారు. ఇద్దరూ కారులో ప్రయాణిస్తూ రోమాన్స్ చేస్తుండటాన్ని పలువురు వీడియో తీశారు. కారు నగరంలో అత్యంత రద్దీగా ఉండే లా కాలేజ్ స్క్వేర్ నుంచి శంకర్ నగర్ వెళ్లే మార్గంలో ఉంది. అదృష్టవశాత్తు ఇలా కారు నడుపుతున్న సందర్భంలో ఇతర వాహనదారులకు ఎలాంటి ప్రమాదం ఎదురుకాలేదు. ఈ ఘటనపై నగరంలోని అంబజారీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ వీడియో తెగ వైరల్‌గా మారింది. ఈ ఘటన తర్వాత నుంచి ఇద్దరూ కూడా పరారీలో ఉండగా, పోలీసులు వీరిని వార్ధా రోడ్‌లో పట్టుకున్నారు.



## ప్రేమోన్మాది ఘాతుకం.. ప్రియురాలితో సహా ముగ్గురు హత్య

ఇయ్యాల్టి న్యూస్, క్రైం, జూలై 17: బీహార్‌లో ఓ ప్రేమోన్మాది రెచ్చిపోయాడు. ప్రియురాలిని, ఆమె సోదరిని, తండ్రిని అత్యంత దారుణంగా హతమార్చాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని, అతడి స్నేహితుడ్ని అరెస్ట్ చేశారు. ఈ ఘోరం సరన్ జిల్లాలో చోటుచేసుకుంది. సరన్ జిల్లా ధన్‌దిహ గ్రామంలో మంగళవారం రాత్రి జబర్ సింగ్ ఇంటికి వచ్చిన ఒక యువకుడు కత్తితో అతడి ఇద్దరు కుమార్తెలను పొడిచి చంపాడు. అడ్డొచ్చిన జబర్ సింగ్, అతని భార్యకు కూడా దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనలో జబర్ సింగ్ ప్రాణాలు కోల్పోగా.. భార్య తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇక స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. నిందితుడ్ని, అతడికి సహకరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. భయాందోళనకు గురయ్యారు. ఇక ప్రేమ వ్యవహారంతోనే హత్య జరిగినట్లుగా పోలీసులు తేల్చారు. దర్యాప్తు కొనసాగుతోంది. ఇక మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఛప్రాలోని సదర్ ఆస్పత్రికి తరలించారు. గంటల వ్యవధిలోనే నిందితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు.



## కాలిఫోర్నియాను విడిచిపెట్టనున్న మస్క్..కారణం ఏందంటే...?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 17: ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరైన వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ కాలిఫోర్నియాను విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారు. స్పేస్ ఎక్స్ , సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ ప్రధాన కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. కాలిఫోర్నియాలో చేసిన చట్టం కారణంగా.. తాను ఈ నగరాన్ని విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నట్లు మస్క్ ఎక్స్ వేదికగా తెలియజేశారు. ఏడాది క్రితమే ఈ చట్టం గురించి కాలిఫోర్నియా గవర్నర్‌కు మస్క్ స్పష్టం చేశారు. ఈ చట్టం వస్తే కంపెనీలు, కుటుంబాలు ఈ నగరం నుంచి వెళ్లిపోవాల్సి వస్తుందని గవర్నర్ కు తెలిపారు. అయినా.. నగర పాలక సంస్థ చట్టాన్ని ఆమోదించింది. ఎలాన్ మస్క్ తీసుకున్న ఈ నిర్ణయం కాలిఫోర్నియా నగరానికి చాలా నష్టం కలిగించనుంది. కాలిఫోర్నియా నుంచి టెక్సాస్‌కు స్పేస్ ఎక్స్, ఎక్స్ ప్రధాన కార్యాలయాలల్ని బదిలీ చేస్తున్నట్లు పారిశ్రామికవేత్త ఎలన్ మస్క్ తెలిపారు. కాలిఫోర్నియాలోని హాతోర్న్‌లో ఉన్న స్పేస్‌ఎక్స్ కార్యాలయాన్ని టెక్సాస్‌లోని స్టార్‌బేస్‌కు, ఎక్స్ హెడ్ క్వార్టర్స్‌ను కాలిఫోర్నియా నుంచి ఆస్టిన్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ సోమవారం కొత్త చట్టంపై సంతకం చేశారు. ఆ తర్వాత మస్క్ ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థుల జెండర్ గుర్తింపు మార్పుల గురించి తల్లిదండ్రులకు చెప్పకుండా టీచర్లను నిషేధించేలా ఈ చట్టం రూపొందించారు. ఈ రకమైన చట్టాల వల్ల కంపెనీలు మరియు కుటుంబాలు తమ పిల్లల భద్రత కోసం కాలిఫోర్నియాను విడిచిపెట్టవలసి వస్తుందని మస్క్ తెలిపారు. కాగా.. వాహన తయారీ సంస్థ టెస్లా యొక్క కార్పొరేట్ ప్రధాన కార్యాలయం కూడా 2021లో కాలిఫోర్నియాలోని పాలో ఆల్టో నుంచి ఆస్టిన్‌కు మార్చారు. మస్క్ టెస్లా యొక్క చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పారిశ్రామికవేత్త తన నివాసాన్ని కాలిఫోర్నియా నుంచి టెక్సాస్‌కు మార్చినట్లు చెప్పారు. అక్కడ రాష్ట్ర వ్యక్తిగత ఆదాయ పన్ను లేనందునా ఈ నిర్ణయం తీసుకున్నారు.



## ఢిల్లీ హైకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్..
## తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 17: మద్యం పాలసీకి సంబంధించిన సీబీఐ కేసులో సీఎం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, విక్రమ్ చౌదరి.. సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీపీ సింగ్ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 29న హైకోర్టు విచారణ జరుపనున్నది. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ జూన్ 26న అరెస్టు చేసింది. అదే నెల 20న ట్రయల్ కోర్టు ఆయనకు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ట్రయల్ కోర్టు నిర్ణయంపై ఈడీ హైకోర్టును ఆశ్రయించగా బెయిల్‌పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత సీబీఐ ఆయనను జైలులో అరెస్టు చేసింది. అనంతరం మూడురోజుల పాటు కస్టడీకి తీసుకున్నది. తనను సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా కోర్టు ఇరువర్గాల వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై 29న వానదలు విననున్నది. ఇప్పటికే ఈడీ కేసులో సుప్రీంకోర్టు ఢిల్లీ ముఖ్యమంత్రికి ఇటీవల బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన సీబీఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీపై తిహార్ జైలులో ఉన్నారు.

## యూపీ బీజేపీలో లుకలుకలు.. ఉప ఎన్నికల ముందు యోగి వర్సెస్ కేశవ్ మౌర్య?

ఇయ్యాల్టి న్యూస్, ఉత్తర్ ప్రదేశ్, జూలై 17: లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్ ప్రదేశ్‌లో బీజేపీ ప్రదర్శన ఆ పార్టీలో విబేధాలకు కారణమైనట్లు తెలుస్తోంది. గత రెండు పర్యాయాల్లో ఉత్తర్ ప్రదేశ్‌లోని మెజారిటీ సీట్లను దక్కించుకున్న బీజేపీ, 2024లో మాత్రం దారుణమైన ఫలితాలను చవిచూసింది. ముఖ్యంగా ప్రతిష్టాత్మక రామమందిరం ఉన్న ఫైజాబాద్ స్థానంలో బీజేపీ ఓడిపోవడం ఆ పార్టీని మరింత కుంగదీసింది. మొత్తం 80 ఎంపీ సీట్లు ఉన్న యూపీలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి 43 సీట్లను గెలుచుకోగా, బీజేపీ కేవలం 36 చోట్ల మాత్రమే విజయం సాధించింది. ఈ నేపథ్యంలో రానున్న 10 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల కోసం బీజేపీ కార్యచరణ సిద్ధం చేసుకుంటోంది. ఇటీవల 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా బీజేపీ కేవలం 2 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఈ నేపథ్యంలో యూపీ ఉప ఎన్నికలు బీజేపీకి చాలా కీలకంగా మారాయి. ఇదిలా ఉంటే యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య మంగళవారం బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని 10 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఉప ఎన్నికలకు ముందు పార్టీ వ్యూహాన్ని సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. యోగి ఆదిత్యనాథ్ కేబినెట్‌తో పాటు బీజేపీ ఉత్తరప్రదేశ్ యూనిట్‌లో కూడా పెద్ద మార్పు వచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే, ముఖ్యమంత్రి యోగి మార్పు గురించి ప్రత్యేకం ఎలాంటి చర్చ జరగలేదని తెలుస్తోంది. రాష్ట్రంలో ఉప ఎన్నికలు ముగిసిన తర్వాత మార్పు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోందని తెలుస్తోంది. మరోవైపు బీజేపీ యూపీ చీఫ్ భూపేంద్ర చౌదరి కూడా నడ్డాలో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో విభేదాల మధ్య కేశవ్ మౌర్య, జెపి నడ్డా మధ్య సమావేశం కూడా జరిగింది.



## సైబర్ నేరాలపై మోదీ కీలక వ్యాఖ్యలు.. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్త అంటూ హెచ్చరిక

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 17: దేశవ్యాప్తంగా రోజురోజుకి సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఈ తరహా నేరాలపై ఎంతగా అవగాహన కల్పించాలని ప్రయత్నించినా.. మారుమూల గ్రామాల్లో చాలా మంది ఇప్పటికీ మోసపోతున్నారు. ఓటీపీ చెప్పడం, లింకులు క్లిక్ చేస్తూ రూ.లక్షలు పోగొట్టుకున్న ఎంతో మంది బాధితులు ఉన్నారు. ఈ నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ కీలక సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలపై పని పూర్తయిన వెంటనే సిస్టమ్స్ లాగౌట్ చేయాలని చెప్పారు. "రోజూ పని పూర్తయిన వెంటనే మీ సిస్టమ్స్ లాగౌట్ చేస్తారా, నేను చేస్తాను. సైబర్ భద్రత విషయంలో ఇది చాలా ముఖ్యం. రోజు చివర్లో అన్ని సిస్టమ్స్ లాగౌట్ అయ్యాయా, లేదా అని చూసుకొనే పనిని ప్రతీ ఆఫీస్‌లో ఒక వ్యక్తికి అప్పగించాలి. ఇంటికి వెళ్లేప్పుడు నా ఎలక్ట్రానిక్ పరికరాలను నేనే లాగౌట్ చేస్తాను. వాటిని తెరిచి ఉంచితే సైబర్ దాడుల ప్రమాదం పెరిగిపోతుంది" అని మోదీ హెచ్చరించారు. ఇటీవలే సీనియర్ బ్యూరోక్రాట్లతో జరిగిన సమావేశంలో ప్రధాని ఈ హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మార్చిలో ప్రధాని మోదీతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ 'చాయ్ పే చర్చ'లో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా తాను బిల్ గేట్స్‌తో సైబర్ భద్రత గురించి చర్చించినట్లు చెప్పారు. మరోవైపు డీప్‌ఫేక్‌లదుర్వినియోగంపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

# హాస్పిటల్లో చేరిన ఆర్ నారాయణమూర్తి.. అసలు ఏమైంది?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: పీపుల్ స్టార్ ఆర్ నారాయణమూర్తి ఎన్నో విప్లవాత్మక సినిమాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటారు. ఎన్నో సూపర్ హిట్ విప్లవ సినిమాల్లో నటించి, దర్శకత్వం వహించి, కొన్ని సినిమాలు నిర్మించి పీపుల్ స్టార్ గా ఎదిగారు. అయితే గతంలో మాదిరి అంత యాక్టివ్ గా లేకపోయినా ఇప్పుడు కూడా అడపాదడపా సందేశాత్మక సినిమాలు చేస్తున్నారు. తాజాగా ఆర్ నారాయణమూర్తి హాస్పిటల్లో చేరారు. ఆయన ఆరోగ్యం స్వల్పంగా దెబ్బతినడంతో హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ హాస్పిటల్లో చేరినట్టు తెలుస్తుంది. అక్కడ డాక్టర్ బీరప్ప పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఆర్ నారాయణమూర్తి సన్నిహితులు ఈ విషయం తెలిపారు. అయితే ఆయనకు ఏమైంది, ఎందుకోసం హాస్పిటల్లో చేరారు అనేది తెలియాల్సి ఉంది. ఆర్ నారాయణమూర్తి హాస్పిటల్లో చేరారని విషయం తెల్సి అభిమానులు ఆవేదన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకొని రావాలని కామెంట్స్ చేస్తున్నారు.



**చూసి ముర్వాలే**



## సంయుక్త అందాల అరాచకం.. రూట్ మార్చేసి చీరకట్టులో అదరగొడుతూ



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: సినిమాల్లో పద్ధతిగా కనిపించే సంయుక్తమీనన్ రీసెంట్ గా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోస్ చూసి అవాక్కవుతున్నారంతా. పింక్ శారీలో చూపుతిప్పుకోనివ్వకుండా అందాలు ఆరబోస్తూ ఫొటోలు షేర్ చేసింది.

## కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ మాటలు.. పూరీ జగన్నాథ్ 'డబుల్ ఇస్మార్ట్' పాటపై దుమారం



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ రూపొందిస్తున్న డబుల్ ఇస్మార్ట్ శంకర్ నుంచి నిన్న విడుదలైన పాట బీఆర్ఎస్ ఆగ్రహానికి గురైంది. ఈ సినిమాలోని 'మార్ ముంత.. చోడ్ చింత' అనే లిరికల్ సాంగ్ విడుదలైంది. పక్కా మాస్‌బీట్‌లో సాగే ఈ పాటలో హీరో రామ్, హీరోయిన్ కావ్యాథాపర్ కల్లు సీసాలు పట్టుకుని చిందేస్తారు. ఈ పాట మధ్యలో ఇటీవల పాప్యులర్ అయిన 'ఏం జేద్దమంటవ్ మరి' మాటను వాడారు. దీనిపై బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన నాయకుడి మాటను ఇలా కల్లు పాటకు వాడడం ఏంటంటూ ఫైర్ అయింది. ఈ మాటను దురుద్దేశపూర్వకంగానే అందులో ఇరికించారని ఆరోపిస్తోంది. పాటను రాసింది కాసర్ల శ్యామ్, సంగీతం అందించింది మణిశర్మ అయినా కేసీఆర్ మాటను దర్శకుడు పూరి జగన్నాథ్ నిర్ణయం మేరకే పెట్టారని ఆరోపిస్తున్నారు. పాట రాసిన శ్యామ్, పాడిన సిప్లిగంజ్ ఇద్దరూ తెలంగాణ వారే కావడం గమనార్హం. పాట నుంచి కేసీఆర్ మాటను తొలగించడంతోపాటు పూరి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.



## పేరుకి తగిన డ్రెస్....వెలిగిపోతున్న హంసా నందిని..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: టాలీవుడ్ లో హీరోయిన్ గా కన్నా స్పెషల్ సాంగ్స్ లో వెలిగిన హంసానందిని రీఎంట్రీ కోసం ఎదురుచూస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే హంసా లేటెస్ట్ ఫొటోస్ షేర్ చేసింది....



## ప్రకృతి అందాల మధ్య... ముత్యంలా మెరిసిపోతున్న బ్యూటీ మమితా బైజు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: 'ప్రేమలు' బ్యూటీ మమితా బైజు ప్రకృతి అందాల ఆస్వాదిస్తుంది. చూట్టూ గ్రీనరి, మధ్యలో వైట్ డ్రెస్‌లో ఈ భామ ముత్యంలా మెరిసిపోతుంది. ప్రస్తుతం ఆమె ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

## రూ.1000 కోట్లు ప్రభాస్‌కు నార్మల్ కావచ్చు.. నాకు చాలా స్పెషల్ : అమితాబ్ బచ్చన్



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి' బాక్సాఫీస్ వద్ద తన జైత్రయాత్రను ఇంకా కొనసాగిస్తుంది. తాజాగా ఈ చిత్రం రూ.1000 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయినట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కేవలం 17 రోజుల్లోనే రూ.1000 కోట్ల మార్క్ టచ్ చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఇక ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడం పట్ల ఇప్పటికే ప్రభాస్‌తో పాటు దర్శకుడు నాగ్ అశ్విన్ సోషల్ మీడియా వేదికగా ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలావుంటే ఈ సినిమా ఇంత ఘన విజయం సాధించడంపై బిగ్ బీ అమితాబ్ వీడియో రూపంలో ఆనందం వ్యక్తంచేశారు.'కల్కి' ఇంతటి ఘన విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఈ విజయంలో భాగమైన వారందరికీ ధన్యవాదాలు. ఒక మూవీ రూ.1000 కోట్లు సాధించడం అనేది ప్రభాస్‌కు సాధరణ విషయం అవ్వవచ్చు. కానీ నాకు ఇదే మొదటిది. రూ.1000 కోట్ల మూవీలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. ఇప్పటివరకు ఈ సినిమాను 4 సార్లు చూశాను. కల్కి నుంచి చాలా నేర్చుకున్నాను.. నాకు కావాల్సిన వాళ్లందరినీ థియేటర్‌కు పిలిపించుకుని మరి సినిమా చూపించాను. చాలా ఆనందంగా ఉంది అంటూ అమితాబ్ చెప్పుకోచ్చాడు.

## వైట్ శారీలో ... వెన్నెలగువ్వలా మోనాల్ గజ్జర్..!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 17: సినిమాలతో కన్నా బిగ్ బాస్ రియాల్టీ షో తో పాపులర్ అయిన బ్యూటీ మోనాల్ గజ్జర్. వైట్ శారీలో మెరిసిపోతున్న ఫొటోస్ తన సోషల్ మీడియా అకౌంట్లో షేర్ చేసింది...



PUBLISHED AND PRINTED BUY K.RAKESH. ON BEHALF OF RRR MEDIA ..Editor : **RR RATHNA**, Address.Patel Nagar Chowrastha, Amberpet, Hyderabad,Telangana - 500013.
RNI NO. T/TG/2024/ 1093 ..Mobile No : 7013794396, 9949152838 ,Website : www.eyyaltynews.comEMAIL ..ramannews9@gmail.com.